సాక్షి నిజామాబాద్


బుధవారం ¦ 21 ¦ మే ¦ 2025



బంగారు భవిష్యత్తును..

యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు.

-8లో ▸



నిర్లక్ష్యపు నీడలో..

బాల్కొండ ఖిల్లా నిర్లక్ష్యపు నీడలో మగ్గుతోంది. ఖిల్లా ఆనవాళ్లను కోల్పోయే పరిస్థితి దాపురించింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /24.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ చేపట్టాలి



బాల్కొండ: భూ భారతిలో రైతులు అందజేసిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో విచారణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రెవెన్యూ బృందాలకు సూచించారు. మెండోరా మండలంలోని బుస్సాపూర్, దూదిగాం గ్రామాల్లో రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో చేపడుతున్న విచారణను కలెక్టర్ మంగళవారం పర్యవేక్షించారు. మెండోరా మండలం పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో భూ భారతి గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులు లేకుండా విచారణ చేపట్టొద్దని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న డెస్క్ వర్క్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్, తహసీల్దార్లు శ్రీకాంత్, సంతోష్, మల్లయ్య, కిరణ్మయి, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మూడు క్లినిక్‌లు సీజ్



నిజామాబాద్‌నాగారం: ఆర్మూర్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మూడు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను వైద్యారోగ్య శాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆర్మూర్‌లోని భారతి, ప్రియాంక క్లినిక్‌లలో 2014 నుంచి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. బెంగాల్ నుంచి వచ్చినవారు ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతూ ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారని, అబార్షన్‌లు సైతం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే మరో ఆయుర్వేద క్లినిక్‌ను సీజ్‌చేశారు. క్లినిక్‌లలో అనుమతి లేని మందులు, ఇతర పరికరాలు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

పూర్తయిన గాలికుంటు టీకాల పంపిణీ




డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో నెల రోజుల పాటు కొనసాగిన పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ పూర్తయ్యింది. జిల్లాకు 2లక్షల డోసులు తెప్పించగా, ఇప్పటి వరకు 1.82లక్షల పశువులకు (82శాతం) టీకాలు వేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి తెలిపారు. టీకాలు ఇంకా అందుబాటులో ఉన్నాయని తెల్ల, నల్లజాతి పశువులకు ఇంకా ఎవరైనా టీకాలు వేయించని పక్షంలో స్థానిక పశువైద్య అధికారులను సంప్రదించి వేయించాలని సూచించారు.

సెల్‌ఫోన్ల చోరీ.. రెండేళ్ల జైలు



కామారెడ్డి క్రైం : ఓ ఇంట్లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గుండ్ల రాజు ఇంట్లో 2016 మే 8న వేకువజమున చోరీ జరిగింది. దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనం చేసిన వ్యక్తిని కామారెడ్డి పట్టణానికి చెందిన సద్దుల శంకర్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటినుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో కామారెడ్డి కోర్టు న్యాయమూర్తి సుధాకర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు. నిందితునికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

మా రూల్స్.. మా ఇష్టం



- ఇదీ నిజామాబాద్ నగరపాలక సంస్థ అధికారుల తీరు
- రిజెక్ట్ చేస్తారు.. తరువాత అనుమతులిస్తారు
- మరికొన్ని చోట్ల అనుమతులు లేకుండానే నిర్మాణాలకు దన్నుగా నిలుస్తున్న అధికారులు
- ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకోని ఉన్నతాధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరపాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అంతా మా ఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ చట్టాలు, నిబంధనలు బేఖాతరు చేస్తూ మా రూల్స్.. మా ఇష్టం అన్నట్లుగా ఫైళ్ల కథలు నడిపిస్తున్నారు. ముడుపులు అందనంతవరకు అనుమతులు ఇవ్వకుండా.. ముడుపులు ముట్టాక వాటికే తక్షణ అనుమతులు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేసినప్పటికీ చూసీచూడనట్లు ఉంటున్నారు.



■ పూసలగల్లీలో ఒక ప్రభుత్వ ఉద్యోగి సైతం అన్ని నిబంధనలు అతిక్రమించి భవనం నిర్మించేలా టీపీఎస్ రాజేష్ కథ నడిపిస్తున్నట్లు పలువురు ఫిర్యాదులు చేశారు. మాస్టర్‌ప్లాన్ మేరకు 60 అడుగుల రోడ్డుకు బదులు 40 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. నగరపాలక సంస్థకు గిఫ్ట్‌గా ఇచ్చిన 10 అడుగుల స్థలంలోనూ నిర్మాణం చేస్తున్నారు. రోడ్‌ఎఫెక్టెడ్ ఏరియా వదలకుండానే భవనం కడుతున్నారు. పైగా ఇటీవల దీనికి సంబంధించి రోడ్డుపైనే బోరు వేయడం గమనార్హం. బోరు విషయమై ఫిర్యాదు వచ్చినప్పటికీ నగరపాలక అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారు. మళ్లీ అదే బోరును వాడుతుండడం విశేషం. ఈ భవనానికి సంబంధించి అనుమతుల కోసం 14.11.2024, 25.11.2024, 30.12.2024, 27.02.2025న దరఖాస్తులు చేసుకోగా నాలుగుసార్లు తిరస్కరించారు. మళ్లీ మరుసగా ఐదోసారి 19.04.2025న దరఖాస్తు చేసుకోగా టీపీఎస్ రాజేష్ అనుమతులు ఇవ్వడం గమనార్హం. గతంలో టీపీఎస్ రాజేష్ రెండుసార్లు, టీపీఎస్ అనుపమ ఒకసారి, టీపీఎస్ రాజేంద్రప్రసాద్ ఒకసారి తిరస్కరించారు. మళ్లీ ఐదోసారి టీపీఎస్ రాజేష్ అనుమతులు ఇచ్చేలా కథ నడపడం గమనార్హం. ఈ విషయమై పలువురు నగరపాలక కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. టీపీఎస్ రాజేష్ ఇచ్చిన అనుమతులన్నింటిపై తనిఖీలు చేయాలని ఫిర్యాదులో పేర్కొనడం విశేషం. ఈ విషయమై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దిలీప్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

■ నగరంలోని ఖలీల్‌వాడిలో గల విజయ ఆస్పత్రి బహుళ అంతస్తుల భవనానికి సంబంధించి అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కనీసం ఇక్కడ ఫైర్ ఇంజిన్ తిరిగే పరిస్థితి లేదు. పై గా రోడ్డు ఆక్రమించి నిర్మాణం చేశారు. సెట్‌బ్యాక్ ఊసే లేదు. సెల్లార్ అనుమతులు లేవు. ఇక పార్కింగ్ సైతం లేదు. ఇలాంటి నేపథ్యంలో నగరపాలక అధికారులు మాత్రం అనుమతులు ఇవ్వడం గమనార్హం. టీపీఎస్ రాజేష్ ఆధ్వర్యంలో అన్ని ఉల్లంఘనలు జరిగాయని ఫిర్యాదు దారుడు హనుమాన్లు పేర్కొన్నారు. దీనిపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఆస్పత్రిలో ఇటీవల రిసెప్షనిస్టే వైద్యం చేసిన నేపథ్యంలో నవీపేట మండలం నాళేశ్వర్‌కు చెందిన కొందరు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయగా రూ.10 వేలు జరిమానా విధించి మమ అనిపించారు. వైద్యులు లేకుండానే చికిత్స చేసిన విషయమై రగడ చోటుచేసుకుంది. కాగా విజయ ఆస్పత్రికి సంబంధించి ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

విజయ ఆస్పత్రి విషయమై హైకోర్టుకు



అనుమతులు సక్రమంగా లేకుండానే విజయ ఆస్పత్రి భవన నిర్మాణం చేశారు. 2011లోనే అనుమతులు తీసుకున్నారని టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ రాజేశ్ చెప్పడం అవినీతికి నిదర్శనం. నగరపాలక, అగ్నిమాపక అధికారులకు ముడుపులు ముట్టడంతో కళ్లముందే నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు వైద్యులు లేకుండానే చికిత్సలు చేస్తున్న విషయమై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయగా మొక్కుబడిగా రూ.10 వేలు జరిమానా విధించి వదిలేశారు. దీనిపై హైకోర్టుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాం.

– తిరుపతి హనుమాన్లు, ఫిర్యాదుదారు

భారీగా పోలీస్ సిబ్బంది బదిలీ

- 22 మంది ఏఎస్సైలు.. 26 మంది హెడ్ కానిస్టేబుళ్లు
- 116 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సాయిచైతన్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ సీపీ సాయిచైతన్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే స్టేషన్‌లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 22 మంది ఏఎస్సైలు, నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 26 మంది హెడ్ కానిస్టేబుళ్లతో పాటు 2018 నుంచి ఇప్పటి వరకు బదిలీకాని 116 మంది కానిస్టేబుళ్లకు స్థాన చలనం కలిగింది. సీపీగా సాయిచైతన్య బాధ్యతలు చేపట్టిన తర్వాత బదిలీలు చేపట్టడం ఇదే తొలిసారి. సిబ్బందికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం బదిలీ ప్రక్రియను చేపట్టారు. అలాగే విధులు నిర్వర్తించే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్న సిబ్బందిని దూరప్రాంతాలకు బదిలీ చేసినట్లు తెలిసింది. గతంలో సీపీగా పనిచేసిన నాగరాజు 90 మందికి పైగా కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

టీకాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 28వ తేదీ వరకు..
- అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల పిల్లలు.. గర్భిణులకు
- ప్రత్యేక శిబిరాల ఏర్పాటు



నిజామాబాద్‌నాగారం: వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని ఐదేళ్ల లోపు పిల్లలు, డ్రాప్ అవుట్ పిల్లలతోపాటు గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జిల్లాలో 705 శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులను వైద్యారోగ్యశాఖ గుర్తించింది. గర్భిణులు 409 మంది, పిల్లలు 2569 మందికి టీకాలు వేయనున్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా 12 టీకాల శిబిరాలను హైరిస్క్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో అంగన్‌వాడీ ఆయాలు పిల్లలను, గర్భిణులను టీకాల కేంద్రాలకు తరలిస్తే, ఏఎన్‌ఎంలు టీకాలు ఇస్తారు.

డీఐవో పర్యవేక్షణ చేయాలి

జిల్లాలో 225 సబ్‌సెంటర్లు, 27పీహెచ్‌సీ, 07సీహెచ్‌సీ, 10 యుపీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి(ఆర్మూర్), జిల్లా ఆస్పత్రి(బోధన్), జీజీహెచ్ తదితర ఆస్పత్రులున్నాయి. వీటి పరిధిలో 705టీకాల శిబిరాలు ఏర్పాటు చేశారు. డీఐ(జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి) పర్యవేక్షించనున్నారు. వీరితోపాటు ఆయా డివిజన్‌ల డిప్యూటీ డీఎంహెచ్‌వోలు సైతం పరిశీలించనున్నారు.

ప్రతి ఒక్కరికీ టీకాలు ఇవ్వాల్సిందే

జిల్లాలో ఐదేళ్ల వయస్సు వర కు పిల్లలకు నెలవారి, ఆరు నెలల, ఏడాది టీకాలు కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. డ్రాప్ అవుట్ పిల్లలను ఇప్పటికే గుర్తించాం. జరిగింది. ఈ నెల 21 నుంచి 28వరకు పిల్లలందరికీ కచ్చితంగా టీకాలు వేసేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

రాజకీయ కక్షతోనే నోటీసులు

వేల్పూర్: కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ ను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు పంపడం రాజకీయ కక్షపూరిత చర్య అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అవి కాళేశ్వరం కమిషన్ నోటీసులు కావని, కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులని దుయ్యబట్టారు. నిద్రాహారాలు మాని తెలంగాణ ప్రజల సాగునీటి గోస తీర్చేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, ఈ ప్రాజెక్టుతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణాగా మారి పచ్చని పంటలతో విరాజిల్లిందని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకు అవసరమున్నప్పుడల్లా డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణ శ్రేయస్సు కోసం పనిచేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

చేతులెత్తేసిన ఐకేపీ

- ఒక్క బస్తా కాంటా చేయలేదు
- జలాల్‌పూర్‌లో కొనుగోలు కేంద్రం ఎత్తివేత
- ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి నష్టపోయిన రైతులు



జలాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఐకేపీ సిబ్బంది (ఫైల్)

బాల్కొండ: యాసంగి సీజన్ ధాన్యాన్ని సేకరించేందుకు మండలంలోని జలాల్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ఒక్క బస్తా ధాన్యాన్ని కూడా కాంటా చేయకుండానే కొనుగోలు కేంద్రాన్ని ఎత్తివేశారు. హమాలీలు లేరంటూ ధాన్యం సేకరించకుండానే చేతులెత్తేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోయారు. జలాల్‌పూర్ రైతులు సుమారు 760 ఎకరాల్లో వరి సాగు చేశారు. సగం విస్తీర్ణంలో వ్యాపారులతో బైబ్యాక్ ఒప్పందం చేసుకొని సీడ్ వరి సాగు చేయగా ఆ దిగుబడిని వ్యాపారులు తీసుకున్నారు. మిగతా సగం విస్తీర్ణంలో సాగైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు రూ.1900కు క్వింటాల్ చొప్పున విక్రయించారు. ఈ లెక్కన బోనస్ కలుపుకుంటూ రైతులు క్వింటాల్‌కు రూ.900 నష్టపోయారు. ఖరీఫ్ సీజన్‌లోనైనా పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న బెటాలియన్స్ డీఐజీ సన్నీ



గౌరవ వందనం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీజీఎస్‌పీ) బెటాలియన్స్ డీఐజీ సీ సన్ని సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా డిచ్‌పల్లిలోని టీజీఎస్‌పీ ఏడో బెటాలియన్ను మంగళవారం ఆయన సందర్శించారు. కమాండెంట్ పి సత్యనారాయణ ఆధ్వర్యంలో డీఐజీ కి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇన్స్‌పెక్షన్ పరేడ్‌కు కమాండర్‌గా అసిస్టెంట్ కమాండెంట్ కేపీ సత్యనారాయణ వ్యవహరించారు. బెటాలియన్ సిబ్బంది నుంచి డీఐజీ సన్ని గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం దర్బార్ నిర్వహించి అధికారులు, సిబ్బంది సమస్యలను డీఐజీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. మంచి ఆహారం, తగినంత వ్యాయామం, యోగా ఆచరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. తర్వాత బెటాలియన్ ఆవరణలో డీఐజీ మొక్కను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కేపీ శరత్‌కుమార్, ఆర్‌ఐలు కే త్రిముఖ్, ఏ నవనీత్‌కుమార్, బి వసంత్‌రావు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌గా పశు పోషణ

- సేవలతో పాటు ప్రోత్సాహకాలను మరిచిన ప్రభుత్వం
- వేగంగా తగ్గుతున్న పశు సంపద
- పశువులను అమ్ముకుంటున్న పోషకులు





శిథిలావస్థకు చేరిన ఇందల్వాయి పశువైద్యశాల

ఇందల్వాయి: జిల్లా వ్యాప్తంగా పశు సంపద వేగంగా క్షీణిస్తోంది. వ్యవసాయానికి అనుబంధంగా ఉంటూ రైతులకు అదనపు ఆదాయాన్ని అందించడమే కాకుండా, నిరుద్యోగులకు స్వయం ఉపాధి అందించే పశు పోషణ రంగం తిరోగమనంలో పయనిస్తోంది. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడం, అర్హులకు అవసరమైన రాయితీలు సకాలంలో అందకపోవడంతో పశు పోషకులు పశువులను అమ్ముకుంటున్నారు.

ప్రధాన కారణాలివే..!

గ్రామాల్లోని దాదాపు ప్రతి ఇంట్లో పాడి పశువులతో పాటు మేకలు, కోళ్లు ఉండేవి. అలాగే ప్రతి తండాలో ఆవుల మందలు ఉండేవి. పశువుల మేయడానికి అనుకూలంగా ఉండే భూములు(కంచెలు) వ్యవసాయ భూములుగా మారిపోవడం, పశువుల పాకలు ఖరీదైన ఇళ్ల స్థలాలుగా మారిపోవడం, రైతులకు, యువతకు పశుపోషణ అనేది భారంగా, చులకనగా మారడం, పశువైద్యానికి, పశు సంవర్ధక శాఖకు ప్రభుత్వం సరైన ప్రాధాన్యత కల్పించకపోవడం వంటి కారణాలతో పాడి పశువులతోపాటు మేకలు, గొర్ల సంఖ్య వేగంగా తగ్గుతోంది.

గణాంకాలు ఇలా..

ఐదేళ్లకోసారి పశుగణన చేపడుతున్నారు. 2024కు సంబంధించిన పశుగణన వివరాలను ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించలేదు. అయితే 2019 లెక్కల ప్రకారం ఆవుజాతి పశువులు 1,01,252, గేదెజాతి – 2,06,898, గొర్రెలు – 7,35,549, మేకలు – 1,56,619, పందులు – 1,749 ఉన్నాయి. జిల్లాలో 2024లో చేపట్టిన పశుగణన వివరాలు వెల్లడించడానికి తమకు ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా గేదెల్లో 27 శాతం, ఆవుల్లో 27.78 శాతం, గొర్రెలు 17, మేకలు 7.82 శాతం తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

జిల్లా పశుసంవర్ధక శాఖలో ఖాళీలు	
మండల పశువైద్యాధికారులు	11
ఏడీ	01
వెటర్నరి అసిస్టెంట్‌లు	17
ఆఫీస్ సబార్డినేట్	08
ల్యాబ్ అటెండర్	02
సీనియర్ అసిస్టెంట్	01
ప్లాంట్ ఆపరేటర్	01
విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్	01

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

జిల్లాలోని చాలాచోట్ల పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సరైన మరమ్మతులు, నిర్వహణ లేక మూలనపడ్డాయి. నూతన భవనాలకు, పాతవాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని ప్రజాప్రతినిధులు హామీలకే పరిమితమయ్యారు. ఇందల్‌వాయి, సిర్నాపల్లి పశు వైద్యశాలలే ఇందుకు నిదర్శనం. చాలా మండలాల్లో పశువైద్యులుగా ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. గోపాల మిత్రల సేవలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కూలిన సిర్నాపల్లి పశువైద్యశాల గోడ

అగమ్యగోచరంగా..



పశువైద్య శాఖలో గోపాలమిత్రల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తొమ్మిది నెలలుగా జీతాలు లేవు. ఇచ్చే రూ.11 వేలల్లో రూ.4 వేలు వంద పశువులకు గర్భాధారణ చేయించే లక్ష్యానికే కట్టాలి. ప్రతి వారం పదుల సంఖ్యలో పశువులు అమ్మకానికి వెళ్తున్నాయి.

– బాలగంగారాం, గోపాలమిత్ర, గన్నారం

రాయితీలు అందించాలి



వ్యవసాయానికి అనుబంధంగా రెండు గేదెలను పెంచుతున్నా. పశువుల షెడ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంకా మంజూరు కాలేదు. పశు వైద్యశాలలను ఆధునీకరించి సరిపడా వైద్య సిబ్బందిని నియమించాలి. యువ రైతులకు పశు పోషణపై అవగాహన కల్పించి గేదెలు, ఆవులు, మేకల పెంపకంలో రాయితీలు, ప్రోత్సాహకలు అందిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. – పూదరి నవీన్, నల్లవెల్లి

క్లుప్తంగా

ప్రశాంతంగా కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5 వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం నాలుగవ రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 32 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 12,417 మందికి 11,587 మంది హాజరు కాగా 830 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 6,040 మందికి 5,689 మంది హాజరు కాగా 351 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 6,377 మందికి 5,898 మంది హాజరు కాగా 479 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు

సదాశివనగర్: తనను మానసికంగా హింసిస్తూ కుల బహిష్కరణ చేసిన సంఘ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుప్రియాల్‌కు చెందిన కిష్టయ్య పద్మశాలి సంఘం సభ్యుడు. తాను పెట్టిన ఓ పోలీసు కేసును తొలగించాలంటు సంఘ సభ్యులు హింసిస్తున్నారని అంతేకాకుండా గత మూడేళ్లుగా కుల బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదస్సును విజయవంతం చేయండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్న తెలుగు శాఖ అధ్యాపకుల వార్షిక సదస్సును విజయవంతం చేయాలని పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీలో 120 క్రెడిట్స్‌కు బదులుగా తెలుగుకు 12 క్రెడిట్స్ మాత్రమే ఇస్తామని తెలియజేసిందన్నారు. దీనికి సంబంధించిన అంశంలో స్పష్టత తీసుకొచ్చి తెలుగు భాష గొప్పదనాన్ని ముందుకు తీసుకెళ్లే కార్యాచరణను సదస్సులో చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి తెయూ అనుబంధ కళాశాలల తెలుగు అధ్యాపకులు హాజరు కావాలని కోరారు.



సొరంగ మార్గం పరిస్థితి


శిథిలావస్థకు చేరిన ఖిల్లా ప్రవేశద్వారం


ఖిల్లాలోని మైసమ్మ ఆలయం

నిర్లక్ష్యపు నీడలో బాల్కొండ ఖిల్లా..!

- ఆనవాళ్లు కోల్పోతున్న వైనం
- శిథిలావస్థకు చేరుతున్న కోట గోడలు
- పట్టించుకోని పురావస్తు శాఖ


ముళ్ల పొదల్లో ఉన్న బాల్కొండ ఖిల్లా

బాల్కొండ: బాల్కొండ ఖిల్లా నిర్లక్ష్యపు నీడలో మగ్గుతోంది. ఖిల్లా ఆనవాళ్లను కోల్పోయే పరిస్థితి దాపురించింది. బాల్కొండలో క్రీ.శ 1059వ సంవత్సరంలోనే మల్లయోధులు అల్లయ్య, కొండలు పాలించిన సమయంలో బాల్కొండ ఖిల్లాను నిర్మించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. తరువాత బహమనీ సుల్తానుల నుంచి కాకతీయ రాజుల వరకు బాల్కొండ(అల్లకొండ)ను పాలించారు. ఆ సమయంలో బాల్కొండ ఖిల్లాను 40 ఎకరాల స్థలంలో నిర్మించారు. ఖిల్లా ప్రధాన ద్వారాలు, ఖిల్లాలో ఆలయాలు, కొనేరు, అత్తా కోడళ్ల బావి, సొరంగ మార్గాలున్నాయి. అంతేకాకుండా ఫిరంగులు, మందు పాతరలను భద్రపరిచే ఆనవాళ్లు ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఖిల్లాతో పాటు బాల్కొండ గ్రామం నాలుగు వైపుల ప్రవేశ ద్వారాలు కూడ ఉన్నాయి. కాని అందులో మూడు ప్రవేశ ద్వారాలు శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. ప్రస్తుతం ఆర్మూర్ గైనిలో ఒక ద్వారం ఉంది. సంవత్సరాల తరబడి ఖిల్లాను పట్టించుకోకపోవడంతో ఖిల్లా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

మొద్దు నిద్రలో పురావస్తు శాఖ..

బాల్కొండ ఖిల్లాను పురావస్తు శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఖిల్లాను అభివృద్ధి చేయాలని ఖిల్లా పరిరక్షణ సమితి సభ్యులు పలు మార్లు పీఎంవో, సీఎంకు వినతి పత్రాలు ఇచ్చారు. కాని ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఖిల్లాపై పెరిగిన పిచ్చి మొక్కలను కూడా తొలగించలేని దుస్థితితో శాఖ ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో తొలిగించాలని స్థానిక అధికారులకు కూడా వినతి పత్రం అందించారు. కాని వారు సైతం పట్టించు కోవడం లేదు.

పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం..

బాల్కొండ ఖిల్లాను అభివృద్ధి చేస్తే పర్యాటకంగా వెలుగొందే అవకాశం ఉంది. బాల్కొండ ఖిల్లాపై అత్త కోడళ్ల బావి ఉంది. ఆ బావిలో ఓ వైపు ఉప్పు నీరు, మరో వైపు మంచి నీరు ఉంటుంది. ఉప్పు నీరు ఉన్న బావిని అత్త, మంచి నీరు ఉన్న బావిని కోడలు బావిగా పిలుస్తున్నారు. అలానే శివలింగం ఉంది. అల్లయ్య, కొండయ్యల విగ్రహాలు చేతులు, కాళ్లు నరికి వేసినవిగా ఉంటాయి. ఖిల్లాకు పైభాగాన చెరువు, కింది వైపు పచ్చని పొలాలు ఉన్నాయి. పాలకులు స్పందించి వెంటనే అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖిల్లాను అభివృద్ధి చేయాలి



బాల్కొండ ఖిల్లాను అభివృద్ధి చేయాలి. ఖిల్లా ప్రాంతంలో అనేక ప్రాచీన కోటలు ఉన్నాయి. వాటన్నింటికి మరమ్మతులు చేపడితే అనేక మంది పర్యాటకులు వస్తారు. ప్రాచీన విషయాలు తెలుస్తాయి. ఖిల్లా వివరాలను భవిష్యత్తు తరాలకు అందించాలి.

– రాజేశ్వర్, గ్రామస్తుడు

ప్రధానికి విన్నవించాం



బాల్కొండ ఖిల్లాకు మరమ్మతులు చేపట్టి, అభివృద్ధి చేయాలని పీఎంవో కార్యాలయంలో ప్రధానికి విన్నవించాం. సీఎంవోలో సీఎంకు విన్నవించాం. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు. ఉపాధి కూలీలతో పిచ్చి మొక్కలను కూడా తొలిగించడం లేదు. ప్రభుత్వం స్పందించి ఖిల్లాను అభివృద్ధి చేయాలి.

– నర్సింగ్‌రావు, ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు

అక్రమాల్లో పెత్తనం

- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం
- ఉద్యోగ సంఘం నాయకుడి తీరుపై మండిపడుతున్న ఉద్యోగులు

నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ వారి వెన్నంటే ఉండి నడిపించే వాడు నాయకుడు.. కానీ ఓ ప్రధాన సంఘం నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. తాను చెప్పిందే వేదమని.. తాను చేసే పనులకు ఎవరైనా అడ్డొస్తే సహించేది లేదంటు తరచూ ఉద్యోగులపై మండిపడుతున్నాడు.

అక్రమాలకు ఆదేశాలు

జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖలో టీఎన్జీవోస్ సంఘానికి చెందిన ఓ ఉద్యోగి, అతని భార్య పనిచేస్తున్నారు. వీరు పక్కపక్కనే ఉండే రెండు భవనాల్లో పనిచేస్తున్నారు. ఇద్దరు ఒకే దగ్గర పనిచేసేలా సదరు నాయకుడు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆదేశాలు ఇప్పించారు. కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇందుకు సంఘం నాయకుడే ప్రధాన కారణమని తెలిసింది. ఇటీవల వ్యవసాయశాఖలో ఓ ఉద్యోగి మరణించాడు. అతనికి సంబంధించి బెనిఫిట్స్ రాకుండా అడ్డుపడినట్లు తెలిసింది. అంతేకాకుండా డివిజన్ల వారిగా టీఎన్జీవోస్ సమావేశాల్లో ఉద్యోగులపై తనకు సహకరించకుంటే సహించేది లేదంటూ తరచూ బెదిరింపులకు పాల్పడడం కొనసాగుతోంది.

మండిపడుతున్న సంఘం ఉద్యోగులు

టీఎన్జీవోస్‌లో సంఘం నాయకుడి వ్యవహారశైలిపై మిగతా కార్యవర్గ నాయకులు మండిపడుతున్నారు. నాయకుడి తీరుపై రాష్ట్ర కమిటీని కలిసి ఫిర్యాదు చేస్తామని టీఎన్జీవోస్‌కు చెందిన ఓ సీనియర్ నాయకుడు తెలిపారు. ఇటీవల సమావేశాలు నిర్వహించి సంఘానికి సంబంధించిన ఖర్చుల వ్యవహారం వెల్లడించకపోవడంపై కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అంజయ్య

ఖలీల్‌వాడి: యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీసీపీ శ్రీనివాస్ రావు సూచించారు. నగరంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మంగళవారం గంజాయికి అలవాటు పడిన యువకులతో పాటు వారి తల్లితండ్రులకు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్ అంజయ్య, టాస్క్‌ఫోర్స్ ఎస్సై గోవింద్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అందమైన జీవితాన్ని మత్తుకు బానిస కాకుండా చూసుకోవాలని యువకులకు సూచించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా మత్తు పదార్థాలు సరఫరా చేసినా, గంజాయి పెంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

వదంతులను నమ్మవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

నవీపేట: బక్రీద్ పండగ నేపథ్యంలో లేనిపోని పుకార్లను నమ్మవద్దని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. పీఎస్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవులను తరలిస్తున్నట్లు సమాచారం వస్తే ముందుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్, ఫొటోగ్రఫీ కోర్సుల్లో ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఎలక్ట్రీషియన్(30 రోజులు), 26 నుంచి ఫొటోగ్రఫీ(30 రోజులు) శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి అవసరమైన టూల్స్, యూనిఫాం అందిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా వ్యాపార అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, పలు అంశాలు నేర్పిస్తారని, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తారని అన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 35 ఏళ్ల వయసు గల గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కోరారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 08461–295428 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు 2025–26 విద్యాసంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులు బుధవారం, గురువారం రోజున ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెయూ దోస్త్ కో–ఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. 21న పీహెచ్‌సీ(దివ్యాంగులు), సీఏపీ, 22న ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులం ఆక్టివిటీస్ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన అడ్మిషన్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లు రెండు సెట్లు జిరాక్స్ తో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు హాజరు కావాలని దోస్త్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి తీవ్రగాయాలు

కామారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడికి తీవ్రగాయాలైన ఘటన కామారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం పని నిమిత్తం బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. కిందపడడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాడ్సిలో రేకుల షెడ్డుకు నిప్పు



మోపాల్: మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు నల్ల శశాంక్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రేకుల షెడ్డుకు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పు పెట్టారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం శశాంక్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పరికరాల కోసం షెడ్డును నిర్మించుకున్నాడు. రాత్రి 1.30 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తున్న గ్రామస్తులు షెడ్డుకు నిప్పంటుకున్న విషయాన్ని శశాంక్‌కు ఫోన్ ద్వారా చెప్పడంతో వెంటనే పోలీసులకు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే షెడ్డులో ఉన్న పైపులు, ట్రాక్టర్ టైరు, ఇతరత్ర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అక్కడే ఏర్పాటు చేసిన తన తండ్రి నల్ల చిన్న సాయిరెడ్డి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. సీఐ సురేశ్, ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శశాంక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. రూ.20వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

గాంధీనగర్‌లో దొంగల బీభత్సం

నవీపేట: మండలంలోని గాంధీనగర్‌లో ముసుగులు ధరించిన దొంగల ముఠా సోమవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. గుర్తు తెలియని 8 మంది గ్రామంలోకి చొరబడి అన్ని ఇళ్ల తాళాలను పగులగొట్టేందుకు యత్నించారు. సుదర్శన్‌కు చెందిన కిరాణ దుకాణం షట్టర్‌ను తొలగించి లోపలకు ప్రవేశించారు. చప్పుడు రావడంతో మేల్కొన్న గ్రామస్తుల అలజడికి దొంగలు పారిపోయారు. ఈ దృశ్యాలు గ్రామంలో అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దొంగలను పట్టుకుంటామని నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

ముంబోజీపేటలో ఒకరి అదృశ్యం



లింగంపేట: మండలంలోని ముంబోజీపేట గ్రామానికి చెందిన పస్కూరి కాశీరాం అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై వెంకట్రావు మంగళవారం తెలిపారు. మూడు రోజుల క్రితం భార్య రాణితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

ఖలీల్‌వాడి: అనారోగ్యంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్‌కు చెందిన దోమల చంద్రకళ(55) ఆరు నెలలుగా అనారోగ్యంతో పాటు మానసికంగా బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ధర్మాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత



రాజంపేట: పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను రికవరి చేసి బాధితుడికి అందించినట్లు ఎస్సై పుష్పరాజ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన వెంకోళ్ల యాదగిరి 15 రోజుల క్రితం తన ల్యాప్‌టాప్‌ను పోగొట్టుకున్నాడు. పోలీసులు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ అనుమానిత వ్యక్తిని విచారించారు. డేటాబేస్ ఆధారంగా ల్యాప్‌టాప్‌ను పట్టుకుని బాధితుడికి అందించినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు చిరంజీవి, చరణ్ ఉన్నారు.

పాతకక్షలతో ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై దాడి జరిగిన ఘటన నగరంలోని మైఫిల్ హోటల్ వద్ద జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన సాయికుమార్, సాయినాథ్‌లకు గతంలో పాత కక్షలు ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి సాయికుమార్ తన స్నేహితుడైన శివ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని మంగళవారం ఉదయం 3 గంటలకు మైఫిల్ హోటల్ వద్దకు వచ్చారు. కాగా అక్కడే ఉన్న సాయినాథ్ వీరిని పలుకరించాడు. సాయికుమార్‌ను పక్కకు రావాలంటు సాయినాథ్ కోరడంతో అతను వెళ్లాడు. తనపై గణేశ్ ఉత్సవాల్లో ఎందుకు పోలీస్ కేసు పెట్టావంటు జేబులో ఉన్న బ్లేడ్‌తో సాయికుమార్ గొంతుపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నందిపేట్‌లో యువకుల ఘర్షణ



నందిపేట్: మండల కేంద్రంలోని బస్‌డిపో స్థలంలో గుర్తు తెలియని యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. డొంకేశ్వర్ మండల కేంద్రానికి చెందిన కొండూర్ రమేశ్ అనే వ్యక్తి సోమవారం రాత్రి మద్యం తాగేందుకు స్థానిక బస్ డిపో స్థలానికి వచ్చాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల మధ్య రమేశ్‌కు గొడవ జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో రమేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో అచేతన స్థితికి చేరాడు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకు వివరాలు సేకరించారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోన్నాజీపేట్‌లో చోరీ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తొంటకొల్ల గంగారం సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దాబాపై నిద్రపోయారు. విషయం గమనించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, 12 తులాల వెండి ఆభరణాలు, రూ. మూడు లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంక్‌లో డీజిల్..

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్ తండా శివారులో ఉన్న ఇండియన్ బంక్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 154 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు బంక్ వెనక వైపు నుంచి లోపలికి వచ్చి సీసీ కెమెరాలను నిలిపేశారు. ఆ తర్వాత బంక్‌లోని ఆన్‌లైన్ సిస్టమ్‌ను బ్రేక్ చేశారు. డీజిల్ గన్‌ను అన్‌లాక్ చేసి రూ.14,951 విలువైన 154 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. ఈవిషయమై ఎస్సై యాదగిరి గౌడ్ వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ శివారులోని పంట పొలాల్లో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన రైతు రాజేశ్ తనకున్న రెండు గేదెలను తీసుకొని శివారు ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడి రెండు గేదెలపై పడ్డాయి. ఈ ఘటనలో అవి మృతి చెంది. పక్కనే ఉన్న మరో 20 గేదెలు, పశువలకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ ఏడీఈ కృష్ణ చైతన్య, మండల పశువైద్యాధికారి రవికిరణ్, రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం/ ఎల్లారెడ్డి: రేకుల షెడ్డు విషయంలో కక్ష పెంచుకుని ఓ మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన షేక్ కరీముల్లా తన ఇంటికి ఆనుకుని వసిముద్దీన్ అనే వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించాడు. ఈ విషయంలో రెండు కుటుంబాల మధ్య పలుమార్లు గొడవ జరిగింది. ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు షెడ్డును కూల్చివేశారు. దీంతో కరీముల్లా భార్య అయిన వసీమా బేగం పై వసీముద్దీన్ కక్ష పెంచుకున్నాడు. ఆమె 2022 మే 10న ఇంటి ఎదుట కూర్చుని ఉండగా ఇనుప రాడ్డుతో దాడి చేసి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన ఎల్లారెడ్డి పోలీసులు వసీముద్దీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వర ప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, ప్రస్తుత సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేశ్, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిబ్బంది సాయిలును ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

దాడి చేసిన ఘటనలో ముగ్గురికి రెండేళ్ల జైలు

వర్ని: మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడికి పాల్పడిన ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్షను బోధన్ అదనపు జడ్జి సాయి శివ మంగళవారం విధించినట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. 2017లో వర్ని మండలం సిద్ధాపూర్‌కు చెందిన దౌలత్ రావు, శంకర్, సరిచంద్ అనే వ్యక్తులు అదే గ్రామానికి చెందిన పద్మ, మాణిక్యంద్‌లు మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడి చేశారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి దాడికి పాల్పడిన ముగ్గురికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌లో ఐదుగురికి..

బోధన్‌టౌన్: రాత్రి వేళల్లో దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తెరిచి ఉంచిన నలుగురితో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన మరొకరికి జైలు శిక్ష పడినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌లో రాత్రి వేళల్లో దుకాణాలు తెరిచి ఉంచుతున్న ఇద్దరు ఫాస్ట్‌ఫుడ్, మరో ఇద్దరు దాబా నిర్వాహకులతో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి శేషతల్ప సాయి ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురికి..

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఐదుగురికి స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం జైలు శిక్షను విధించినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పీఎస్‌లలో పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 21 మంది పట్టుబడగా వారికి కౌన్సెలింగ్ చేపట్టి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. వీరిలో నలుగురికి రెండు రోజులు, ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

పొతంగల్ కలాన్‌కు చెందిన ఒకరికి..

రుద్రూర్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్షను బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి విధించినట్లు కోటగిరి ఎస్సై సునీల్ మంగళవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పొతంగల్ కలాన్‌కు చెందిన ఇమ్రాన్‌కు ఒక రోజు జైలు శిక్ష, రూ. నాలుగు వేలు జరిమానా విధించారు. అదేవిధంగా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన శేఖర్‌కు రూ. రెండు వేలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు ఎస్సై తెలిపారు.

మోపాల్‌కు చెందిన మరొకరికి..

మోపాల్: మండల కేంద్రంలో ఈనెల 18న నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో న్యాల్‌కల్‌కు చెందిన మునిపల్లి సునీల్‌కు మంగళవారం మెజిస్ట్రేట్ నూర్జహాన్ మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాయపర్చిన ఒకరికి రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి: రైల్వే ట్రాక్‌పై పాతిపెట్టిన జెండా విషయంలో గొడవపడి తోటి గ్యాంగ్‌మన్‌ను తీవ్రంగా గాయపర్చిన మరో గ్యాంగ్‌మన్‌కు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి పమూజుల శ్రీనివాస్‌రావు మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ కార్యాలయంలో గ్యాంగ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అహ్మద్ హుస్సేన్ 28జనవరి2016 న ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి దగ్గరలో ఉన్న రైల్వే ట్రాక్‌పై జెండాను పాతి పెట్టాడు. ఇతనికి దూరంగా పనిచేస్తున్న మరో గ్యాంగ్‌మన్ సురేశ్ తనకు జెండా అవసరం ఉందంటు హుస్సేన్ దగ్గరికి వచ్చాడు. తన దగ్గర ఉన్న ఒక్క జెండాను పాతిపెట్టానని హుస్సేన్ తెలుపడంతో గొడవ జరిగింది. సురేశ్ కోపంతో ఇనుప సుత్తెతో హుస్సేన్‌పై దాడి చేశాడు. దీంతో కేసు నమోదైంది. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. విచారణలో సురేశ్ నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు.